## రిషికప్రియ కుటుంబానికి అండగా ఉంటాం

మదనపల్లె, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :

అభం, శుభం తెలియని కామాందుని చేతిలో అత్యాచారానికి గురై కిరాతకంగా హత్య కావింపబడిన రిషికప్రియ కుటుంబాన్ని అన్ని విధాల అదుకొంటామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. బుధవారం రిషికప్రియ తల్లిదండ్రులను ఎమ్మెల్యే షాజహాన్ బాషా, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబులు ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్ళారు. ఈ సందర్భంగా



ముఖ్యమంత్రితో చిన్నారి తల్లిదండ్రులు

ముఖ్యమంత్రి వారితో మాట్లాడుతూ అధైర్యపడాల్సిన అవసరం లేదని ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. తక్షణం రూ.15లక్షలు ఆర్థికసాయం మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. చిన్నారులపై కామాదులు కన్నేస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు. అనంతరం చిన్నారి తల్లిదండ్రులు హోమ్ మంత్రి అనిత, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌లను వీరి ద్వారా కలిశారు. జరిగిన ఘటనను మంత్రులకు వివరించారు. అనంతరం మంత్రులు వారికి మనోధైర్యం కల్పించి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.


ప్రభాత

# కడప-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గురువారం 26 ఫిబ్రవరి 2026


## వందశాతం పన్ను వసూళ్ళకు చర్యలు

**జిల్లా పంచాయితీ అధికారి రాధమ్మ**

మదనపల్లె, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :



గ్రామాల్లో మార్చి 10లోపు వందశాతం ఇంటిపన్ను వసూళ్ళకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా పంచాయితీ అధికారి రాధమ్మ తెలిపారు. బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో 25మండలాల్లో 411గ్రామ పంచాయితీలు ఉన్నాయని వీటిలో 2,83లక్షలు అసెస్మెంట్లుకు గాను ఇంటి పన్ను డిమాండ్ రూ.15కోట్లు ఉందన్నారు. ఇప్పటి వరకు రూ.9కోట్లు వసూలు చేయడం జరిగిందన్నారు. పాత బకాయిల వసూళ్ళకు కూడా ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. పన్ను వసూళ్ళకు సంబంధించి గ్రామ కార్యదర్శులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రతి ఇంటికి వెళ్ళి పన్నులు వసూలు అయ్యేలా చూడాలని ఆదేశించడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రజలు ఇంటిపన్ను చెల్లించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

# వ్యవసాయంలో డ్రోన్ల వినియోగాన్ని పెంచాలి



అంగన్వాడి సెంటర్ ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ నిశాంత్ కుమార్



డ్రోన్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

లక్కిరెడ్డిపల్లి : ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

రైతులు మంచి ఆదాయాన్ని ఇచ్చే ఉద్యానవన పంటలవైపు మళ్ళాలని, వ్యవసాయంలో డ్రోన్ల వినియోగాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లి మండలం అప్పకొండయ్యగారి పల్లిలో ఉపాధి హామీ పనులను, దిన్నెపాడు గ్రామంలోని కోమటివాని వంక వాటర్ షెడ్ ను, రామరాజు వంక వాటర్ షెడ్ ను, కోనంపేట గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని, మామిడి తోటను, దొర్రి చెరువు, సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను, సీసీ రోడ్ల పనులను, లక్కిరెడ్డిపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ అప్ప కొండయ్యగారిపల్లిలో ఒక మామిడి తోటలో జరిగిన ఉపాధి హామీ పనులను పరిశీలించి మామిడి తోటకు నీరు ఎలా వస్తుంది డ్రిప్ ఇరిగేషన్ ఎందుకు వినియోగించుకోవడం లేదు ఆదాయం ఎంత వస్తుంది గతంలో ఏ పంట పండించారు వంటి పలు ప్రశ్నలను మామిడి తోట రైతును అడిగి పలు సూచనలు చేశారు. కరువు ప్రాంతంగా ఉండడం వల్ల భూగర్భ జలాలను పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని నీటి యాజమాన్య సంస్థ అధికారులను మరియు సిబ్బందిని ఆదేశించారు. సహజ వ్యవసాయ పద్ధతులను రైతులందరూ అవలంబించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గుర్తించిన ప్రాంతాలలో నీటి కుంటల పనులను త్వరగా పూర్తి చేయాలని నీటి యాజమాన్య సంస్థ అధికారులను ఆదేశించారు. దిన్నెపాడు గ్రామంలోని కోమటివాని వంక వాటర్ షెడ్ ను, రామరాజు వంక వాటర్ షెడ్ వాటర్ షెడ్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ వరి పంట కాకుండా రైతులకు ఆదాయాన్ని ఎక్కువగా ఇచ్చే ఉద్యాన పంటలను పండించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. వాటర్ షెడ్ లను ఎక్కడ ఏర్పాటు చేస్తారు భూమి పరిమియాబిలిటీ ఏవిధంగా తెలుసుకుంటారు వంటి పలు ప్రశ్నలను నీటి యాజమాన్య సంస్థ వారిని అడిగి తగు సూచనలు చేశారు. అనంతరం అక్కడి రైతులతో మాట్లాడుతూ వరి పంట కాకుండా ఉద్యాన పంటల వైపు మళ్ళితే మంచి ఆదాయం వస్తుందని నీటి వినియోగం తగ్గుతుందని భూగర్భ జలాలను బాగా వినియోగించుకోవచ్చని సూచించారు. కోనంపేట 1 అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనికి చేసి అంగన్వాడీ కేంద్రంలో ఉన్న పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని స్వయంగా పరిశీలించారు. పిల్లల ఎత్తు మరియు బరువును స్వయంగా పరిశీలించి రిజిస్టర్లలో నమోదు చేసిన నెంబర్లతో సరిపోల్చారు. అనంతరం ఐసిడిఎస్ శాఖ అధికారి హైమావతి కి అంగన్వాడీ కేంద్రాలపై పలు సూచనలు చేశారు. అంగన్వాడి కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బంది వినియోగిస్తున్న మొబైల్ యాప్ ను స్వయంగా పరిశీలించి తగు ఆదేశాలు జారీ చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ ను సందర్శించి ఆ హాస్టల్ కు ఒక స్మార్ట్ టీవీ మరియు ఆర్వో ప్లాంట్ ను అందించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. హాస్టల్లో ఉన్న వసతులను స్వయంగా పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. అనంతరం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా పురుగుమందులను పంపిణీ చేసే ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. మనుషులను వినియోగించుకుంటే ఎంత సమయం పడుతుంది డ్రోన్‌ను వినియోగించుకుంటే రైతులకు గిట్టుబాటు అవుతుందా లేదా వంటి పలు ప్రశ్నలను వ్యవసాయ శాఖ అధికారులనడిగి తగు సూచనలు చేశారు. రైతులకు మంచి ఆదాయం అందించే ఉద్యాన పంటలపై అవగాహన పెంచి ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పలు గ్రామస్తులు తమ గ్రామాలకు సంబంధించిన సమస్యలను కలెక్టర్‌కి విన్నవించుకోగా వాటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని తాసిల్దారును మరియు ఇతర అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డ్వామా పీడీ వెంకటరత్నం, ఐసీడీఎస్ పీడీ పద్మావతి, వాటర్ షెడ్ ఎపిడి వెంకట నరసయ్య, జిల్లా విద్యాధికారి సుబ్రహ్మణ్యం, జిల్లా వ్యవసాయ అధికారి శివ నారాయణ, డిఆర్‌ఈవో సతీష్ కుమార్, డీఈ విద్య, ఎండిఒ రెడ్డెయ్య, తహసీల్దార్ క్రాంతికుమార్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ కిషోర్ కుమార్, ఏపీఎస్పీడీసీఎల్ డి.ఈ. నాగముని స్వామి, ఏఈ హరినాథ్, హార్టికల్చర్ అధికారిణి సింధూరి, అగ్రికల్చర్ అధికారిణి రాజ కుమారి, ఆసుపత్రి సూపరిండెంట్ శివ కుమార్, ఎంఈవో 1 చక్రే నాయక్, ఎంఈవో 2 వెంకట సుబ్బయ్య, మండల ఇంజినీర్ జగదీష్, మండల టీడీపీ అధ్యక్షుడు యనమల మదన్ మోహన్, మార్కెట్ యార్డు ఛైర్మెన్ షఫీ నాయక్, మండల అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నిఘా నీడలో ఇంటర్ పరీక్షలు

మదనపల్లె క్రైమ్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త.



జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల భద్రతా ఏర్పాట్లను ఎస్పీ ధీరజ్ కునుబిల్లి బుధవారం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. రాయచోటిలోని జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంతో పాటు, సంబేపల్లి మండలం ఎర్రగుంట్లలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులం పరీక్షా కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. పరీక్షలు జరుగుతున్న తీరును, పోలీసు బందోబస్తును పరిశీలించి ఎస్పీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ ఖచ్చితంగా అమలు చేయాలని, అపరిచిత వ్యక్తులు, గుంపులు గుంపులుగా ఉండకుండా చూడాలని ఆదేశించారు. జిరాక్స్ సెంటర్లను తప్పనిసరిగా మూసి ఉంచాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు ఎటువంటి భయం, ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా అన్ని చర్యలు తీసుకున్నామని, మాల్ ప్రాక్టీస్ వంటి వాటికి తావులేకుండా పారదర్శకంగా పరీక్షలు నిర్వహించేలా పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. విధుల్లో ఉన్న పోలీసులు అప్రమత్తంగా ఉంటూ విద్యార్థులకు, పరీక్షా సిబ్బందికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఎస్పీ వెంట రాయచోటి పట్టణ సీఐ బి.వి. చలపతి, ఎస్ఐ విష్ణువర్ధన్, సంబేపల్లి ఎస్ఐ రవికుమార్, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**పరీక్షలకు 15,632 మంది హాజరు**

బుధవారం నిర్వహించిన ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లీషు పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 14,822 మంది హాజరైనట్లు డీఐఈఓ రవి తెలిపారు. ఓవరాల్ గా 15,632 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 14,822 మంది హాజరు కాగా 810 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 14,340 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 13,714 మంది హాజరు కాగా, 626 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1,292 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 1,108 మంది హాజరు కాగా 184 మంది గైర్హాజరయ్యారు.

## ఇంటర్ ఇంగ్లీష్ పరీక్ష 774 మంది విద్యార్థులు గైర్హాజన్

కడప ఫిబ్రవరి 25 ప్రభాతవార్త.

జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ పేపర్-1 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మూడో రోజు నిర్వహించిన ఈ పరీక్షలకు 96 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 62 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 18,165 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 17,391 మంది హాజరై పరీక్షలు రాశారు. 774 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ కోర్సుకు చెందిన 16,685 మంది విద్యార్థుల్లో 16,068 మంది పరీక్షలకు హాజరయ్యారు. 617 మంది పరీక్షలకు హాజరు కాలేదు. అదే విధంగా ఒకేషనల్ కోర్సుకు చెందిన 1,480 మంది విద్యార్థుల్లో 1,323 మంది హాజరై పరీక్షలు రాయగా, 157 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టి, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు పర్యవేక్షించారు. మొత్తం మీద మూడో రోజు పరీక్షలు సాఫీగా, ప్రశాంత వాతావరణంలో ముగిశాయి.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

రాజంపేట,ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామపంచాయతీలో తెలుగుదేశం పార్టీ విజయం సాధించేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పార్టీ రాజంపేట అసెంబ్లీ ఇంచార్జ్ చమర్తి జగన్మోహన్రాజు పిలుపునిచ్చారు. కూటమిప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన కోరారు. బుధవారం రాజంపేటమండలం చెర్లోపల్లె గ్రామంలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ గ్రామసభ లో ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలను,ఎన్డీఏ కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పేర్కొన్నారు. సామాజిక న్యాయం అమలు చేసిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు.అంకితభావం కలిగిన కార్యకర్తలే, తెలుగుదేశం పార్టీ బలం అన్నారు. అదేవిధంగా ప్రతి గ్రామంలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరాలని,వారానికి ఒకరోజు పార్టీ కోసం కేటాయించి,గ్రామ పరిధిలో సచివాలయ సిబ్బందితో కలిసి స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమిష్టిగా కృషి చేయాలని చమర్తి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో క్షత్రియ



చెర్లోపల్లె గ్రామసభలో మాట్లాడుతున్న జగన్ మోహన్ రాజు

కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు,మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నే సుబ్బ నాయుడు ,మన్నూరు సొసైటీ చైర్మన్ ముళ్ళగూరి సుబ్రహ్మణ్యం నాయుడు,టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్,మండల పార్టీ అధ్యక్షులు రవికుమార్ నాయుడు,మండల ప్రధాన కార్యదర్శి జీ.వీ సుబ్బరాజు,తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొండూరు శరత్ కుమార్ రాజు,మాజీ అధ్యక్షులు సుబ్బరాజు నరసింహరాజు హస్తివారిపల్లె రామ్మోహన్, జె.కృష్ణంరాజు, రాజేష్,రామచందర్ రాజు, జగదీశ్వర్ రాజు,ఎల్ఐసి వెంకటరాజు, తదితరులు పాల్గొన్నారు.

## భక్తితో శాంతి, సౌభ్రాతృత్వం పెంపొందుతాయి

**మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి**

**ఆలయాల అభివృద్ధితో ఆధ్యాత్మిక చైతన్యం విస్తరిస్తుంది**

**శ్రీనందీశ్వర ఆలయ ప్రతిష్ట కార్యక్రమంలో వైఎస్ జగన్**

**వేదపండితుల నైతృత్వంలో ప్రత్యేక పూజలు**

**భారీగా తరలి వచ్చిన భక్తులు, అభిమానులు**

వేంపల్లె:ఫిబ్రవరి 25(ప్రభాత వార్త)

భక్తి మార్గం ద్వారా శాంతి, సౌభ్రాతృత్వం పెంపొందుతాయని వైఎస్ఆర్సీపి అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా వైఎస్ జగన్ బుధవారం నందిపల్లిలో వెలసిన నూతన విగ్రహ ప్రతిష్ట, కుంభాభిషేక మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు, వేద పండితుల నేతృత్వంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, హోమాల్లో పాల్గొని భక్తి శ్రద్ధలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనం స్వీకరించారు. వైఎస్ జగన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాల అభివృద్ధి, పునర్నిర్మాణం ద్వారా ఆధ్యాత్మిక చైతన్యం మరింత విస్తరిస్తుందని, దేవాలయాలు సంస్కృతి, సంప్రదాయల ప్రతికలని వెల్లడించారు. ఈ కార్యక్రమం గ్రామ ప్రజల ఐక్యతకీ నిదర్శనమన్నారు. నందీశ్వరుడి కృపాకటాక్షాలు సమస్త ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్ రెడ్డి, కన్వీనర్ కె.చంద్రఓబుల్ రెడ్డి, వేంపల్లె మాజీ సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, నందిపల్లి సర్పంచ్ మారం సులోచనమ్మ, శ్రీనందీశ్వర ఆలయ కమిటీ ఛైర్మన్ మారం శ్రీకాంత్ రెడ్డి, ఇతరత్రా ప్రజాప్రతినిధులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



## పురిటి బిడ్డ మృతి

మదనపల్లె క్రైమ్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త.



ప్రైవేటు ఆసుపత్రిలో బుధవారం ఓ పురిటిబిడ్డ మృతి చెందింది. తంబళ్లపల్లి నియోజకవర్గం ములకలచెరువుకు చెందిన అబ్దుల్ సమద్, హీన దంపతులు ప్రసవం కోసం ఈనెల 21న మదనపల్లిలోని శాంతారాం ఆసుపత్రిలో చేరారు. అక్కడ డ్యూటీలో ఉన్న వైద్యులు హీనకు ప్రసవం చేశారు. బిడ్డకు నెలలు నిండకపోవడం, బరువు తక్కువగా ఉండడంతో చిన్నపిల్లల ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. హుటాహుటిన ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలోని ఒక ప్రైవేట్ చిన్నపిల్లల ఆసుపత్రికి బిడ్డను తరలించారు. అక్కడ వైద్యులు నాలుగు రోజుల నుంచి చికిత్స లు చేస్తుండగా బుధవారం ఉదయం పురిటిబిడ్డ మృతి చెందింది. బిడ్డ ప్రాణం పోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

## ఏసిబి వలలో చిక్కిన రూరల్ సిఐపై మరో కేసు నమోదు

పులివెందుల ,ఫిబ్రవరి 25 ప్రభాత వార్త :

రెండు లక్షలు డిమాండ్ చేసి ఏ.సి.బి వలలో చిక్కిన పులివెందుల రూరల్ సి.ఐ ఎన్వీ రమణ పై ఎక్సైజ్ శాఖ పోలీసు అధికారులు మరో కేసు నమోదు చేశారు. సింహాద్రిపురంలో మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ కేసు కు సంబంధించి మోటార్ బైక్ విక్రయదారుడైన అనంతపురం జిల్లా కదిరి కి చెందిన వెంకట బాలాజీ కన్సల్టెన్సీ నిర్వహకుడు బ్రహ్మం వద్ద నుండి ఈనెల 23న సింహాద్రిపురం ఎస్.ఐ అనిల్ కుమార్ రూ.1.50 లక్షలు లంచం తీసుకుంటుం డగా ఏసిబి డి.ఎస్పీ సీతారామారావు ఆధ్వర్యంలో రెడ్ హ్యాండ్ గా పట్టుకొని అరెస్టు చేసిన విషయం విధితమే. ఈ కేసులో బ్రహ్మం కు ఎలాంటి సబంధం లేక పోయినప్పటికీ రూ.4 లక్షలు డిమాండ్ చేశారు. అంత డబ్బు ఇవ్వలేనని చెప్పి రెండు లక్ష రూపాయలకు అంగీకారం కుదుర్చుకుని రూ.50 వేలు ఇచ్చారు. ఈ కేసులో పులివెందుల రూరల్ సి.ఐ ఎన్వీ రమణకు కూడ ప్రమేయం వుండడంతో ఏ.సి.బి అధికారులు ఆయనను కూడా అరెస్టు చేసిన విషయం తెలిసిందే. సి.ఐ ఎన్వీరమణ ఇంట్లో నిర్వహించిన సోదాల్లో 20 తులాల బంగారు ఆభరణాలు, విలువైన గృహోపకరణాలు, విలువైన ఆస్తి పత్రాలు, 59 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఆయనకు నంద్యాలలో డూప్లెక్స్ ఇళ్లు వున్నట్లు గుర్తించారు. వీటితో పాటు కీలక ఆధారాలను ఏ.సి.బి అధికారులు సేకరించారు. సి.ఐ ఇంట్లో నుంచి పత్రాలు తీసుకెళ్తున్న హోంగార్డును అదుపులో తీసుకున్నారు. అతని వద్ద వున్న పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో సి.ఐ ఎన్వీ రమణ ఇంట్లో 59 మద్యం బాటిళ్లు లభించడం తో ఎక్సైజ్ శాఖ తరపున కేసు నమోదు చేసినట్లు పులివెందుల ఎక్సైజ్ సి.ఐ చెన్నారెడ్డి బుధవారం విలేకరులకు తెలిపారు. ఏ.సి.బి సి.ఐ నాగరాజు తన సిబ్బందితో కలసి రూరల్ సి.ఐ రమణ ఇంట్లో సోదాలు నిర్వహించినప్పుడు 59 మద్యం బాటిళ్లు పట్టుకుని పులివెందుల ఎక్సైజ్ పోలీసు స్టేషన్ కు అప్పగించార న్నారు. ఇందులో భాగంగా మద్యం బాటిళ్లను సీజ్ చేసి ఎక్సైజ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశామని సి.ఐ చెన్నారెడ్డి తెలిపారు.



ఎక్సైజ్ శాఖ సిఐ చెన్నారెడ్డి

## అధైర్య పడకండి నేనున్నాను : వైఎస్ జగన్

పులివెందుల ,ఫిబ్రవరి 25 ,ప్రభాతవార్త :

అధైర్య పడకండి మీకు తోడుగా నేనున్నా, సమస్యలు ఉంటే నేరుగా నాతో చెప్పాలని, వచ్చే ఎన్నికల్లో గెలిచేది మనమేనని , అన్యాయం జరిగితే న్యాయం కోసం పోరాటం చేస్తామని వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వ అరాచక పాలనకు చరమగీతం పాడుదాం అని మాజీ ముఖ్యమంత్రి , వైసిపి అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజా దర్బారులో వైసీపీ శ్రేణులకు భరోసా కల్పించారు. కడప జిల్లా పులివెందులలో మూడు రోజుల పర్యటనలో భాగంగా రెండవ రోజు బుధవారం వేంపల్లి మండలం నందిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన నందీశ్వర ఆలయం విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం పులివెందుల పట్టణంలోని తన క్యాంపు కార్యాలయం చేరుకొని అక్కడ ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు ఆయనని కలిసి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి ఆయన స్పందిస్తూ ప్రతి ఒక్కరికి న్యాయం జరిగే వరకు పోరాటం చేసే దానికి సిద్ధంగా ఉన్నామని వారికి భరోసా ఇచ్చారు. ఇకపై ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటానని నాయకులకు స్పష్టత ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి రెడ్డి, జిల్లాలోని ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు ,ప్రముఖ వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**చిరునవ్వుతో సమస్యలు వింటూ భరోసా ఇస్తూ..**

ప్రజా దర్బార్‌కు వచ్చిన ప్రజల, వైసీపీ శ్రేణుల సమస్యలను ఓ



పిగ్గా వింటూ , చిరునవ్వుతో ఆప్యాయంగా పలకరిస్తూ తోడుగా నేనుంటానని వారికి భరోసా ఇచ్చారు. ప్రజలు ఈ సందర్భంగా సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి ఆయన స్పందిస్తూ సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం చేస్తానని, మనకు అన్యాయం జరిగితే న్యాయపరంగా ముందుకు వెళ్దామని, ఎవరు అధైర్య పడకుండా ముందుకు వెళ్లాలన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిసేందుకు రాయలసీమ జిల్లాల నుంచి భారీగా జనం తరలివచ్చారు. వైయస్ జగన్ క్యాంపు కార్యాలయానికి రాగానే వైసిపి నాయకులు, కార్యకర్తలు సీఎం సీఎం అంటూ నినాదాలు చేశారు. ఆయన కలిసేందుకు భారీగా జనం తరలివచ్చారు. జగన్ కార్యాలయం తోపాటు ప్రాంగణం అంతా జనాలతో నిండిపోయింది. జనం రావడంతో వారిని అదుపు చేయలేక పోలీసులు నానా తంటాలు పడాల్సి వచ్చింది.

## కోరికలు తీర్చే మహాతల్లి పాలేటమ్మ

కలికిరి, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:

కోర్కెలు తీర్చే మహాతల్లి పాలేటమ్మ జాతర అంగరంగ వైభవంగా స్థానిక మండలంలోని పారపట్ల గ్రామ పంచాయతీ కురవపల్లిలో జరిగింది. ఈ సందర్భంగా కెంగన కల్పనా ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో 3 సంవత్సరాలప్పుడు స్వయంగా నిర్మించిన పాలేటమ్మ ఆలయంలో ప్రతి ఏటాలా ఈ ఏడాది కూడా అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, కుంకుమార్చన పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేయడం జరిగింది. అనంతరం రాత్రి చాందినీ బండ్లతో, కోలాటాలతో చెక్కభజనలతో విద్యుత్తు దీపాలంకరణతో అంగరంగ వైభవంగా దేదీప్యమానంగా భక్తులకు కనువిందు కలిగేలా చాందిని బండ్లు తప్పి దీలు బోనాలు మోసి మొక్కుబడులు తీర్చుకోవడం జరిగింది.



ఈ కార్యక్రమంలో కెంగన పవన్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, అంబువారిపల్లి కేశవ్‌గౌడ్, శ్రావణ్‌గౌడ్, చరణ్ గౌడ్, ముఖ్య అతిథులుగా సహకార బ్యాంకు ఛైర్మన్ నల్లారి చంద్రకుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నల్లారి లక్ష్మీకర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ మాలతి, రాజంపేట పా ర్లమెంట్ కుర్బా ఛైర్మన్ బడకూరు జనార్ధన్‌గౌడ్, రాజంపేట పార్ల మెంటు జరక సాధికారత అధ్యక్షుడు జ్ఞాన మూర్తి, బీసీ సీనియర్ నేత రవియాదవ్, భారతం మురళీ, మల్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రెడ్డప్పరెడ్డి, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో జింక మృతి

మదనపల్లె క్రైమ్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త.

రోడ్డు ప్రమాదంలో జింక మృతి చెందింది. ఈ సంఘటన బుధవారం మదనపల్లె మండలంలో జరిగింది. అటవీ అధికారుల కథనం మేరకు.. స్థానిక బెంగళూరు రోడ్డులోని రెడిఫుడ్స్ ఫ్యాక్టరీకి సమీపాన ఉన్న చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద ఓ జింక రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ జింక అక్కడే అక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న మదనపల్లి అటవీశాఖ అధికారులు ఘటన స్థలానికి వెళ్లి, మృత జింకను పశువుల ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.






## ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

**నిమ్మనపల్లె, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:**

నిమ్మనపల్లె ప్రభుత్వ జూనియర్ కళశాలలో బుధవారం ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ప్రిన్సిపాల్ శ్రీదర్ తెలిపారు. మండలంలోని జూనియర్ కళాశాలలో బుధవారం 204మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 199మంది విద్యార్థులు హాజరు అయ్యారు. 5మంది గైర్హాజరు అయ్యరు. ఈ పరీక్షలను ఎంఈఓలు పద్మావతమ్మ, నారాయణలు పర్యవేక్షించగా ఎస్ఐ రామక్రిష్ణ బందోబస్తు నిర్వహించారు.

## నీటి సంరక్షణ కోసం పంటసాగులో మార్పు

**వ్యవసాయ అధికారులు సూచనలు**

**నిమ్మనపల్లె, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :**


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నీటి సంరక్షణ కోసం రైతులు పంటల సాగు విధానంలో మార్పు చేయాలని స్థానిక వ్యవసాయ అధికారులు సూచించారు. బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూగర్భజలాలు వేగంగా తగ్గిపోతున్న నేపథ్యంలో వరిపంటను తగ్గించి తక్కువ నీటితో సాగు అయ్యే పంటలను సాగు చేయాలన్నారు. ప్రధానంగా పప్పుదాన్యాలైన కందులు, పెసర్లు, జొన్న, రాగి,సజ్జ, మొక్కజొన్న లాంటి పంటలను సాగుచేస్తే తక్కువ నీటితో రైతులకు మంచి ఆదాయం వస్తుందన్నారు. ఎరువుల వినియోగం కూడా తగ్గుతుందన్నారు. భవిష్యత్తు తరాలకు నీటిని అందించాలంటే ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా వరిసాగును నియంత్రించి తక్కువ నీటి పంటలను ప్రోత్సహించాలన్నారు.

## 21 మందికి పరీక్ష సామాగ్రి పంపిణి..

**సుండుపల్లె, ఫిబ్రవరి 25,ప్రభాతవార్త :**



మండల పరిధిలోని తిమ్మసముద్రం జిల్లా పరిషద్ పాఠశాలలో పదవ తరగతి చదువుచున్న 21 మంది విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని హెడ్ మాస్టర్ రావూరి శేఖర్ మరియు ఎస్సై ఎస్ ఏం డి హుస్సేన్ చేతులు మీదుగా పంపిణి చేసిన ఎంపీపీఎస్ మోడల్ ప్రైమరీ స్కూల్ రాయవరం పాఠశాలలో ఎస్జిటి టీచర్‌గా పని చేయుచున్న ఉత్తమ ఉపాధ్యాయుడు నంద్యాల వెంకట సిద్దయ్య ఆయన సతీమణి నాగేశ్వరి ఆయన మాట్లాడుతు మానవసేవే మాధవసేవ అని దాదాపు 15 సంవత్సరాల నుండి 10 వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు 10,000లు చొప్పున 1,50,000 ఇస్తూరావడం జరుగుతుందని తెలియజేసాడు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు నగదు చెల్లించండి

**సిద్ధవటం ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**



ఉపాధి హామీ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నామని పనులు చేసిన, రోజులకు నగదు చెల్లింపు చేపట్టలేదని ఉపాధి కూలీలు తెలిపారు సిద్ధవటం మండలం ఉప్పరపల్లి గ్రామంలో కొండ ప్రాంతంలో పూడిక పనులు చేస్తున్న కూలీలు బుధవారం మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పని దినాలు వంద రోజులు నుండి 150 రోజులు పెంచాలని గత 6 వారములుగా చేసిన పనులకు నగదు చెల్లింపు చేపట్టక కుటుంబ పోషణ బరువైందని అధికారులు చేసిన పనులకు నగదు చేపట్టాలని, కూలీలకు కొరముట్లు మంజూరు చేయాలని తెలిపారు. ఉపాధి కూలీల విషయమై ఏపిఓ నరసింహులు వివరణ కోరగా ఉప్పరపల్లి గ్రామంలో 24 మంది కూలీలు పనులు చేస్తున్నారని మార్చి నెలలో బడ్జెట్ కేటాయించాక ఉపాధి కూలీలకు నగదు చెల్లింపు చేపడతామని కూలీలకు గడ్డపారలు, రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేశాక అందిస్తామన్నారు కూలీలు ఎవరు కూడా ఆందోళన చెందవద్దని ప్రతి ఒక్కరికి పనులు చేసిన రోజులకు నగదు చెల్లింపు చేపడతామన్నారు.

## నాటుకోళ్ళపై విషప్రయోగం : 20కోళ్ళు మృతి

**చారాల(చౌడేపల్లి), ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**


మృతి చెందిన నాటుకోళ్ళు

నాటుకోళ్ళపై విషప్రయోగం చేయడంతో 20కోళ్ళు మృతి చెందిన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. బాధిత రైతు కథనం మేరకు...మండలంలోని పంచాయతీ కేంద్రం చారాల కుళ్ళాయి వెంకట్రమణ నాటుకోళ్ళ పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నాటుకోళ్ళపై విష ప్రయోగం చేశారని రైతు తెలిపాడు. దీంతో 20నాటుకోళ్ళు మృతి చెంది దాదాపు రూ. 20వేల వరకు నష్టపోయినట్లు అతను వాపోయాడు.

## ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వినియోగించుకోండి

**ముద్దనూరు, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:**

మండల పరిధిలోని ప్రజలు బాల నారాయణరెడ్డి వైద్యశాల ఆవరణలో ఈ నెల 27న శుక్రవారం ప్రముఖ కంటి వైద్యులు గురు అభిలాష్ సమక్షంలో మదర్ థెరిసా సేవా సమితి చారిటబుల్ ట్రస్టు సురేంద్ర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగపరచుకోవాలని డాక్టర్ నవజ్యోత్ తెలిపారు. కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించి అవసరమైన మందులు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కంటి పరీక్షల అనంతరం ఆపరేషన్లు వైద్యశాలలో ఉచితంగా నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు క్రింది నెంబర్ల ను సంప్రదించాలని నవీన్ 95425 41474,రామ్ కుమార్ 9963901237, జూటూరు విజయ్‌కుమార్ 9440268338 కోరారు.

## పాఠశాల ప్రవేశాల కొరకు పరీక్షలు

**నందలూరు ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:**

బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, బాలురు, బాలికల కోసం ఇదివరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల ప్రవేశాల కోసం పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఆడపూరు బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ హైమావతి ఒక ప్రకటనలో తెలిపారు. 5వ, తరగతి కొరకు పరీక్ష వచ్చేనెల 01 వ తేదీ ఉదయం 9:30 నుంచి 11 గంటల వరకు, ఇంటర్మీడియట్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి అదే రోజు 12.00 నుంచి 1:30 వరకు నీట్, ఐఐటి దరఖాస్తు చేసుకున్న వారికి 3.00 నుంచి 4.30 వరకు హాల్ టికెట్ నందు కనపరిచిన సెంటర్లలో పరీక్ష జరుగును అని తెలిపారు. 6,7 తరగతలకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు వచ్చేనెల 08 వ తేదీన ఉదయం 10 .00 నుంచి 11:30 వరకు, 8 ,9 తరగతికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు అదే రోజు 2.00 నుంచి 3.30 వరకు హాల్ టికెట్ పై కనపర్చిన పరీక్ష కేంద్రాలకు వెళ్లి పరీక్షలకు హాజరుకావాలని ఆమె తెలిపారు. ఈ విషయాలను విద్యార్థుల తల్లిదండ్రులు గమనించాలన్నారు.

## పారిశుద్ధ్య, పన్నులపై అధికారులు ద్రుష్టి

**రామసముద్రం పిబ్రవరి 25 ప్రభాతవార్త**



మండల కేంద్రంలో డిప్యూటీ ఎంపిడిఓ గఫూర్, పంచాయతీ కార్యదర్శి మునిస్వామి నాయక్‌తో కలిసి బుధవారం విస్తృత పర్యటన చేశారు. బజారు వీధిలో ఇంటి ఇంటికి వెళ్లి చెత్త సేకరణ నిర్వహించి, చెంబకూరు రోడ్డులో పారిశుద్ధ్య పనులను పనులను పరిశీలించారు అనంతరం మండల కేంద్రంలో దిగువ హరిజనవాడలో పన్నుల చెల్లింపులపై ప్రజలకు అవగాహన కల్పించి ఆన్ లైన్ ద్వారా పన్నులు వసూలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ గఫూర్, పంచాయతీ కార్యదర్శి మునిస్వామి నాయక్, రెడ్డి రామయ్య, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

## అక్రమంగా 5 ఎకరాలు ఆన్లైన్

**రాజంపేట, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**


వినతిపత్రం అందజేస్తున్న పూల భాస్కర్

మండలంలోని ఊటుకూరు గ్రామ పొలంకు సంబంధించి దొంగ డాక్యుమెంట్లతో సర్వే నెంబర్ 1242/2 పోవెత్తి పెడుతూ ఆన్లైన్ అక్రమంగా చేశారని కాంగ్రెస్ పార్టీ రాజంపేట అసెంబ్లీ ఇంచార్జ్ పూల భాస్కర్ ఆరోపించారు. ఈ మేరకు గ్రామస్తులతో కలిసి కార్యాలయంలో అక్రమ ఆన్లైన్‌పై ఫిర్యాదు చేశారు. ఆన్లైన్ చేయించుకున్న వ్యక్తి సమీప బంధువు సబ్ కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్నాడని, దొంగ డాక్యుమెంట్లను సృష్టించి ఆన్లైన్లో ఎక్కించుకున్నారని చెప్పారు. గతంలో ఇసుక డంపింగ్ యార్డ్ కోసం ఆ యొక్క స్థలాన్ని క్లీన్ చేయడానికి ఎమ్మార్వో వస్తే గ్రామస్తులు అడ్డుకున్నారని, ఎండాస్మెంట్ కూడా ఇచ్చారన్నారు. 6.ఎకరాల ఇస్తినముల ఈ భూమి గ్రామంకు సంబంధించిందని, అందులో స్మశానం ఉందనీ, కనకదుర్గమ్మ ఆలయం కూడా ఉందనీ తెలిపారు. అయితే 24 వ తారీకున వీఆర్వో, సర్వేలతో కొలతలు ఏ విధంగా చేపట్టారు, ఎవరి అనుమతితో చేశారనీ ప్రశ్నించారు. సబ్ కలెక్టర్ ఈ అక్రమాలను తొలగించాలని కోరారు.

## యువతకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

**బద్వేలు అర్బన్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. బుధవారం డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్షుడు మస్తాన్ షరీఫ్, కార్యదర్శి ఎస్కే ఆదిల్‌లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముడియం చిన్ని మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ నిరుద్యోగ యువతకు పలు హామీలు ఇచ్చారని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయలేదని విమర్శించారు. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్, నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పినా రెండు సంవత్సరాలు గడిచినా అమలు కాలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం హామీలను అమలు చేసి, నిరుద్యోగభృతి అందించాలని, తక్షణమే జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు.

## టీబీ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి

**లక్కిరెడ్డిపల్లి ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**



టీబీ వ్యాధిపై ప్రతి ఒక్క విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని దేవలంపల్లి ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారిని సుమలత పేర్కొన్నారు. బుధవారం టీబీ వ్యాధి వారోత్సవాల్లో భాగంగా మనిషా విద్యానికేతన్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుమలత మాట్లాడుతూ టీవీ వ్యాధి లక్షణాలు, వాటి నివారణ, ప్రాథమిక దశలోనే నివారించే మార్గం, తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారూ 18.5 కంటే తక్కువ బిఎంఐ ఉన్న వ్యక్తులు, మధుమేహం ఉన్నవారు, మద్యపానం, పొగత్రాగేవారు, 60 ఏళ్ల పైబడినవారు, గత ఐదేళ్లలో టీబీ చికిత్స తీసుకున్న వారు, వీరందరికీ రోగం పునరావృతం కావచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా టీబీ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన పెంచడం, వారు తమ ఆరోగ్యం పై జాగ్రత్తగా ఉండేలా చేయడం, రోగాన్ని శాశ్వతంగా నిర్మూలించాలనే లక్ష్యంతో ఆరోగ్య శాఖ కృషి చేస్తోందని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని పరీక్షలు చేయించుకోవాలని, తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ఆమె కోరారు ఈ కార్యక్రమంలో కృష్ణ చైతన్య రెడ్డి ఫైనీ టీవీ సూపర్వైజర్ హరి, ఏఎన్ఎం బేబీ, ఏహెచ్ఓ శివరంజని, ఓర్పమ్మ, కదిరునిస, సరస్వతి ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## పాల ఉత్పత్తి దారులతో సమావేశం

**రామసముద్రం పిబ్రవరి 25 ప్రభాతవార్త**



మండలంలోని పెద్దకురప్పల్లె గ్రామ పంచాయతీ తిరుమల రెడ్డిపల్లె గ్రామంలోని అమూల్ డైరీని బుధవారం పశు వైద్యాధికారి సందర్శించి పాలఉత్పత్తి దారులు, అమూల్ డైరీ సెక్రటరీ తబ్బషు సర్దార్ బాషా, రైతులు తో సమావేశం నిర్వహించారు. పాలసేకరణ, నాణ్యత ప్రమాణాలు పశువులఆరోగ్యం పై సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ పాడి రైతులు టీకాలు, పోషకాహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని పాలఉత్పత్తి పెంచి ఆదాయం మెరుగుపర్చుకోవాలని ప్రతి రోజు పశువులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పశువులకు ఏవైనా సమస్యలు వస్తే మా సిబ్బందికి తెలియజేయండి సిబ్బంది వచ్చి పశువులను పరీక్షించి వైద్యం అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పావని, వెటర్నరీ అసిస్టెంట్ నరేష్, అమూల్ డైరీ సెక్రటరీ సర్దార్ బాషా, రైతులు పాల్గొన్నారు.

## పాల డైరీ యాజమాన్యం జాగ్రత్తలు పాటించాలి

**లక్కిరెడ్డిపల్లి ఫిబ్రవరి25 ప్రభాతవార్త**

పాల డైరీ యాజమాన్యం డైరీ వద్ద జాగ్రత్తలు పాటించాలని అన్నమయ్య జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వంగవల రంగారెడ్డి పేర్కొన్నారు బుధవారం లకిరెడ్డిపల్లి లోని పాల డైరీ కేంద్రాలను ఆయన పరిశీలించారు పాల డైరీలో జాగ్రత్తలు పాటించకపోతే రాజమండ్రిలో జరిగిన సంఘటనలు జరుగుతాయని పాల డైరీ యాజమాన్యం జాగ్రత్తలు పాటిస్తే ఇలాంటి సంఘటనలు జరగవు అన్నారు అధికారులు పాల డైరీ కేంద్రాలను పరిశీలన చేసి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పాలు పెరుగు అన్ని ప్రజలకు సక్రమ పద్ధతులు అద్దేటట్టు చూడాలన్నారు.

## ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయండి

**పెద్దమండెం ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

విద్యార్థులు పదో తరగతి పరీక్షలను ఆత్మవిశ్వాసంతో ఒత్తిడికి లోను కాకుండా పరీక్షలు రాసి ఉత్తీర్ణతసాధించాలని హెల్పింగ్ మైండ్స్ అధ్యక్షుడు అబూబకర్ సిద్ధిక్ అన్నారు బుధవారం మండలంలోని సిద్దవరం కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాలలో 40 మంది విద్యార్థులకు పరీక్షల కిట్ పంపిణీ చేశారు. హెల్పింగ్ మైండ్స్ సమస్త సభ్యుడు పవన్ పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు కిట్టు పంపిణీ చేయడం జరిగిందన్నారు ఆత్మవిశ్వాసంతో ఒత్తిడిని జయించి పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాలని కోరారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాణి కుమారి ఉపాధ్యాయులు లావణ్య పార్వతి సాయి స్నేహ రెడ్డమ్మ అశ్విని ఆదిలక్ష్మి జయలక్ష్మి హెల్పింగ్ మైండ్స్ సభ్యులు పవన్ అమీన్ హర్షియా హర్షాద్ సైత్సవలి రాపియా తదితరులు పాల్గొన్నారు.

## జనసేన ఉద్యమి సమావేశం

**బద్వేలు, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త**



జనసేన పార్టీ నిర్వహించిన ఉద్యమి సమావేశం సందర్భంగా ఆ పార్టీ నాయకులు పరస్పరం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అనంతపురం అహుడా చైర్మన్ టిసి వరుణ్‌ను బద్వేలు జనసేన పార్టీ ఏఎంసీ డైరెక్టర్ చిన్ని సుబ్బారావు మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ బలోపేతం, గ్రామస్థాయి సమస్యల పరిష్కారం, యువతకు రాజకీయ అవకాశాల కల్పన వంటి అంశాలపై ఇరువురు నాయకులు చర్చించినట్లు సమాచారం. రాష్ట్రంలో జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించుకున్నట్లు తెలిసింది. బద్వేలు నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు సమన్వయంతో ముందుకు సాగాలని చిన్ని సుబ్బారావు పేర్కొన్నారు. ఉద్యమి సమావేశం విజయవంతంగా నిర్వహించినందుకు నాయకులు సంతృప్తి వ్యక్తం చేశారు.

## లేవుట్లపై అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయండి

**యర్రగుంట్ల ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:**



యర్రగుంట్ల మున్సిపల్ పరిధిలోని 3 అనధికారిక లేఅవుట్ల క్రమబద్దీకరణలో భాగంగా సర్వే నెంబర్.342,634,321/3తి లే అవుట్లపై ఇప్పటివరకు మున్సిపల్ కార్యాలయంలో ఎటువంటి అభ్యంతరాలు అందలేదని, ఈ లేఔట్లను అధికారికంగా ఆమోదించినట్లు యర్రగుంట్ల మున్సిపల్ కమిషనర్ శేషఫణి తెలిపారు. ఈ 3 లేఅవుట్లపై ఏదైనా అభ్యంతరాలు ఉంటే 15 రోజులలోపు మున్సిపల్ కార్యాలయంలో రాతపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చున్నారు.

## సిసి డ్రైన్‌ను ప్రారంభించిన కార్పొరేటర్ వాణి

**కడప కార్పొరేషన్ ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:**



నగరంలోని 37వ డివిజన్ ఎ1 నగర్‌లో సిసి డ్రైన్ పనులను డివిజన్ కార్పొరేటర్ సమ్మెట వాణి, వైఎస్ఆర్సిపి బిసి సెల్ స్టేట్ జనరల్ సెక్రెటరీ సమ్మెట బసవరాజ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు పాటుపడ్డారని తెలిపారు. రాష్ట్రం కోసం రాష్ట్ర ప్రజల కోసం కష్టపడే నాయకుడు జగన్మోహన్ రెడ్డి అన్నారు. కడప ఎంపీ అవినాష్ రెడ్డి నిధులతో మేము మా డివిజన్ నందు 2 లక్షల రూపాయలతో సిసి డ్రైన్ ను ప్రారంభించామన్నారు. నగరపాలక సంస్థల మా నాయకులు గత మేయర్ సురేష్ బాబు మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్ భాష నిరంతరం ప్రజల కోసమే పని చేస్తున్నరని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు నూర్ భాషా, మహబూబ్ ఖాన్, శ్రీనివాసులు, రాము, హుస్సేన్ అయ్యా తదితరులు పాల్గొన్నారు.

## పేదల భూములు జోలికొస్తే కబడ్దార్

**తంబళ్లపల్లె ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :**



ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటు పేరుతో దళితుల భూములను కాజేయడానికి చూస్తే ఊరుకునేది లేదని ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు హెచ్చరించారు. బుధవారం రెడ్డికోట వద్ద ప్రభుత్వం చేపట్టిన బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన రైతుల సదస్సులో ఆయన మాట్లాడుతూ పేదల భూములు జోలికి వస్తే ఖబర్దార్, ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. పాలకులు ఎవరైనా బడుగు బలహీన రైతులే సమిథలవుతున్నారని వాపోయారు. ఎలాంటి పరిశ్రమలు పెడుతున్నారో వివరించకుండా వాటి ద్వారా ఎంత మంది ఉద్యోగాలు వస్తాయో తెలుపకుండా ఎంతమందికి ప్రయోజనం చేయకపోతుందో వివరించకుండా కేవలం పరిశ్రమలు వస్తాయని పేరుతో ప్రజల అభిప్రాయం తో సంబంధం లేకుండా ప్రభుత్వం పేదల భూముల ను సేకరించడం దుర్మార్గమన్నారు. అధికారులు వెంటనే పునరాలోచించి భూములు తీసుకోవడంలో వెనక్కి తగ్గాలని, ప్రత్యామ్నయ భూముల గురించి ఆలోచించాలని, లేని పక్షంలో పేద రైతులు తో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కార్మిక సంఘం జిల్లా నాయకుల సుధీర్ కుమార్, నిర్వాసిత రైతులు భాస్కర్, శ్రీనివాసులు, వెంకటరమణ, శ్రీరాములు, నాగమల్లు, హరి తదితరులు ఉన్నారు.

## ఆరు వారాల అవగాహన

**తంబళ్లపల్లె ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :**

కేంద్ర ప్రభుత్వం విబిజి రాంజీ నూతన ఉపాధి చట్టం ఉపయోగాలు భవిష్యత్ ప్రణాళిక ఆరు వారాల అవగాహన సదస్సు జరుగుతుందని ఏపీవో అంజనప్ప విలేకరులకు తెలిపారు. మార్చ్ రెండో తారీకు నుండి గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఒక్కో వారం ఉపాధి హామీ నూతన చట్టంలో 125 రోజులు పని దినాలు పెంపు, ప్రతి ఒక్కరికి పని, వారానికి ఒకసారి బిల్లులు చెల్లింపు, నిరుద్యోగ భృతి, ఉపాధి చట్టం పై అవగాహన, శ్రామికుల హక్కులపై నిబద్ధత, మునుపటి ఉపాధి చట్టంలోని లోపాలు నేటి చట్టంతో కలిగే వు ప్రయోజనాలు, పంచాయతీ ప్రతినిధుల పాత్ర, పథకం అమలులో మెరుగైన నాయకత్వం ఇంకా పలు అంశాలపై గ్రామ సభల ద్వారా అవగాహన, చర్చలు, వికసిత్ భారత్ పై పాఠశాలల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించడం, కొత్త చట్టంలోని ఉపయోగాలు శ్రామికులతో చర్చావేదికలు, ఉపాధి హామీపై గోడల రాతలు, అవగాహన ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఏపీవో,జేఈ, టి ఏ లు, ఎఫ్ఏ లు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో ఈసీ మహేష్, టిఏలు సుజాత, పుష్పకుమారి, బాలగంగాధర్, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

## గ్రామ స్థాయిలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

**గాలివీడు, ఫిబ్రవరి 25(ప్రభాతవార్త):**



గాలివీడు గ్రామ పంచాయతీ పక్కీరారెడ్డిగారిపల్లె లో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలు బ్యాంకుల ప్రతినిధులు పొదుపు ఎలా చేయడం ఖర్చులు, అత్యవసర నిధి గురించి చెప్పారు. కౌన్సిలర్ పవన్‌కుమార్ సైబర్ క్రైం, సైబర్ ఫ్రాడ్స్ గురించి చెప్పారు. బ్యాంకుకు సంబంధించిన యాప్స్ ఉపయోగించుకుని సురక్షితమైన లావాదేవీలు జరుపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు బ్యాంకుల ప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జాతీయ రాష్ట్రస్థాయిలో నలంద విద్యార్థులు

**సిద్ధవటం ఫిబ్రవరి, 25 ప్రభాతవార్త :**



ఐఐటి, నీట్, ఒలంపియాడ్ ఫలితాల్లో జాతీయ రాష్ట్ర జీవన్ స్థాయిలో అవార్డులు సాధించిన విద్యార్థులకు ఎస్పై హారిక అభినందించారు. మండల కేంద్రమైన సిద్ధవటం నలంద హై స్కూల్ నందు బుధవారం విజయోత్సవ సభకు ఆమె హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పై హారిక మాట్లాడుతూ నలంద స్కూల్ కరస్పాండెంట్ వెంకటసుబ్బయ్య మరియు ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు కృషి పట్టుదల వల్ల ఐఐటి, నీట్, ఒలంపియాడ్ ఫలితాల్లో ఐదు మంది విద్యార్థినిలు జాతీయ, రాష్ట్ర జోనల్ స్థాయిలో అవార్డులు సాధించడం అతి చిన్న వయసులో విద్యార్థులు ఉన్నతమైన స్థాయికి వెళ్లడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఏవో వెంకటేష్, ఉపాధ్యాయులు వైశాలి, నారాయణమ్మ, ప్రమీల పాల్గొన్నారు.

## హోమ్‌మంత్రిని కలిసిన చిన్నారి తల్లిదండ్రులు

**మదనపల్లె, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :**


హోమ్‌మంత్రిని కలిసిన చిన్నారి కుటుంబసభ్యులు

రాష్ట్ర హోమ్‌మంత్రి అనితను రిషికప్రియ తల్లిదండ్రులు గోపీనాథ్, స్వర్ణలతలు కలిశారు. బుధవారం తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు ఆధ్వర్యంలో చిన్నారి తల్లిదండ్రులు హోంమంత్రితో పాటు రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌లను కలిశారు. ఈసందర్భంగా మంత్రులు చిన్నారి కుటుంబసభ్యులతో మాట్లాడుతూ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తొలుత వారు ముఖ్యమంత్రిని కలసిన విషయం వెల్లడించారు. ముఖ్యమంత్రి వారికి రూ.15లక్షలు ఆర్థికసాయం, తిరుపతిలో నివాసం మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దొరస్వామినాయుడు పాల్గొన్నారు.

## టిడిపి కమిటి ప్రమాణ స్వీకారోత్సవానికి విచ్చేయండి

**పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి పఠాన్‌ఖాదర్‌ఖాన్**

**మదనపల్లె, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :**


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాజంపేట పార్లమెంటరీ టిడిపి కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి విచ్చేయాలంటూ ప్రధాన కార్యదర్శి పఠాన్‌ఖాదర్‌ఖాన్ పిలుపునిచ్చారు. ప్రమాణ స్వీకారోత్సవానికి సంబంధించి పట్టణంలోని రాజంపేట పార్లమెంటరీ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ కమిటీలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, అధికార ప్రతినిధులు, సోషల్‌మీడియా ప్రతినిధులు అందరూ కలసి 41మంది సభ్యులు బైపాస్‌రోడ్డులోని రామ్‌తులసి కళ్యాణ మండపంలో మార్చి 2న సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రామక్రిష్ణాచారి, పట్టణ అధ్యక్షులు నాదేళ్ళ అరుణ్‌తేజ్, నాయకులు శీతప్ప, తలారి రాధ, మోహన్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నీటి సంరక్షణ కోసం పంటసాగులో మార్పు

**ఏఓ నవీన్‌కుమార్‌రెడ్డి**

**మదనపల్లె, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :**


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నీటి సంరక్షణ కోసం రైతులు పంటల సాగు విధానంలో మార్పు చేయాలని ఏఓ నవీన్‌కుమార్ రెడ్డి సూచించారు. బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పంటల సాగు పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ భూగర్భ జలాలు వేగంగా తగ్గిపోతున్న నేపథ్యంలో వరిపంటను తగ్గించి తక్కువ నీటితో సాగు అయ్యే పంటలను సాగు చేయాలన్నారు. ప్రధానంగా పప్పుదాన్యాలైన కందులు, పెసర్లు, జొన్న, రాగి,సజ్జ, మొక్కజొన్న లాంటి పంటలను సాగు చేస్తే తక్కువ నీటితో రైతులకు మంచి ఆదాయం వస్తుందన్నారు. ఎరువుల వినియోగం కూడా తగ్గుతుందన్నారు. భవిష్యత్తు తరాలకు నీటిని అందించాలంటే ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా వరిసాగును నియంత్రించి తక్కువ నీటి పంటలను ప్రోత్సహించాలన్నారు.

## ఆడిటర్లతో ఇబ్బందులు పడుతున్న గుత్తేదారులు

**పట్టణంలో కుంటుపడుతున్న అభివృద్ధి పనులు**

**మదనపల్లె, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :**

మున్సిపాలిటి పరిధిలో గుత్తేదారులు చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లింపు విషయంపై ఆడిటర్లు ఇబ్బందులు పెడుతుండడంతో పట్టణంలో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయి. ఆడిటర్ల విషయంపై గుత్తేదారులు ఏకంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజారెడ్డికి, వైస్‌ఛైర్మెన్ జింకా చలపతి, కమిషనర్ ప్రమీలకు సైతం ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై గుత్తేదారులు మాట్లాడుతూ టెండర్ల ద్వారా దక్కించుకొన్న పనులు కౌన్సిల్ ఆమోదంతో పట్టణంలో పనులు పూర్తి చేస్తుండడం జరుగుతోందన్నారు. అయితే ఆడిటర్లు బిల్లులు విషయంలో నెలల తరబడి పెండింగ్‌పెడుతుండడం వల్ల తమకు సకాలంలో బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. బిల్లులు రాకపోవడం వల్ల పనులుకూడా చేపట్టలేకపోతున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆడిటర్లు ఇబ్బందులు పెడుతున్నారన్నారు. కాంట్రాక్టర్ ఈఎండి డిపాజిట్లు సైతం వంద కొర్రిలు పెడుతూ సమస్యలు సృష్టిస్తున్నారన్నారు. మట్టికి జిఎస్‌టి, ఈఎండి డిపాజిట్‌కు జిఎస్‌టి, బిల్లు బిల్లుకు జిఎస్‌టి అడుగుతూ కావాలనే గుత్తేదారులను ఇబ్బంది పెట్టెలా వ్యవహరిస్తున్నారన్నారు. ఆడిటర్లను నియంత్రించకపోతే తాము పనులు చేయలేమంటూ చెబుతున్నారు.

## యూత్ కాంగ్రెస్ నేతల అరెస్ట్ దారుణం:అన్వర్

**పోరుమామిళ్ల రూరల్, పిబ్రవరి25 ప్రభాతవార్త:**



ఆడ లేక మద్దెల దరువు అన్న చందంగా కేంద్ర ప్రభుత్వం యొక్క వ్యవహార శైలి ఉందని, ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ వద్ద ప్రపంచ దేశాల ముందు భారత్ ప్రతిష్టను దిగజారుస్తున్న మోడీ వ్యవహార శైలికి వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలిపిన యూత్ కాంగ్రెస్ కార్యకర్తలను, జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్‌ను అరెస్టు చేయడం దారుణమని ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి అన్వర్ అన్నారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏఐ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నటువంటి తరుణంలో గల్గోటియాస్ యూనివర్సిటీ చైనా రోబోను తామే తయారు చేశామని చెప్పి దేశం పరువు తీసిన ఘోరమైన అవమానం, ప్రతి విషయంలోనూ అమెరికా వద్ద భారతదేశాన్ని తాకట్టు పెడుతూ ప్రతి చిన్న విషయానికి కాంప్రమైజ్ అయిన నరేంద్ర మోడీ వ్యవహార శైలికి వ్యతిరేకంగా యువజన కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన శాంతియుత నిరసన సమంజసమైనదేనన్నారు. బిజెపి యువ మోర్చా నాయకులు ఆంధ్రప్రదేశ్‌లో అనేకచోట్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలపై దాడి చేసి ఫ్లెక్సీలను చించడం పనికిమాలిన చర్య అని ఆయన మండిపడుతూ అరెస్ట్ చేసిన యూత్ కాంగ్రెస్ నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## ఉపాధి హామీ పథకం పేరు మార్పు

**నందలూరు, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మారింది. పాత చట్టం స్థానంలో కొత్తగా భారత పార్లమెంట్ వికసిత్ భారత్ రోజ్ గార్ అండ్ అజివికా మిషన్ గ్రామీణ( విబిజిరామ్‌జి) చట్టం 2025న ఆమోదించడం జరిగినదని ఎంపీడీవో కె.ఆర్.ఎం ప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ ఉపాధి శ్రామికులకు స్థిరమైన జీవనోపాధి అవకాశాలతో పాటు సామాజిక, ఆర్థిక సాధికారతను మరింత బలపరుచుటమే ముఖ్య లక్ష్యంగా ఈ చట్టాన్ని భారత ప్రభుత్వం రూపొందించిందని పేర్కొన్నారు. కావున కొత్త పథకంపై ఈనెల 27 వరకు ప్రజా చైతన్య కార్యక్రమాల ద్వారా ఉపాధి శ్రామికులకు విబిజిరామ్‌జి పేరును అందరు సరళంగా, గుర్తుండే విధంగా అవగాహన కల్పించనున్నట్లు ఎంపిడిఓ తెలిపారు.

## మారక ద్రవ్యాలకు దూరంగా ఉంటే మంచి భవిష్యత్తు

**లక్కిరెడ్డిపల్లి ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**



యువత మారకద్రవ్యాలకు దూరంగా ఉంటే మంచి భవిష్యత్తు ఉంటుందని ఎస్ఐ గోల్కొండ శోభ పేర్కొన్నారు బుధవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్లో 9 10 ఇంటర్ విద్యార్థులకు మార్గదర్గాలపై అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకునే వయసులో గంజాయి డ్రగ్స్ ఇలాంటి వాటికి అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దు అన్నారు చాలా మంది చిన్న వయసులోనే మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలు గురవుతున్నారని ఆమె హెచ్చరించారు అంతేకాకుండా చిన్న వయసులో డ్రగ్స్ అలవాటు పడితే జీవితము సర్వనాశనం అవుతుందన్నారు తల్లిదండ్రులు పిల్లల పైన ఎంతో ఆశలు పెట్టుకుంటారని వారి ఆశలను అడియాసలు చేయొద్దన్నారు బాగా చదువుకొని మంచి మార్కులు సాధించి భవిష్యత్తులో గొప్పవారు కావాలని ఆమె హితోపదేశించారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వారాల రమేష్ ఉపాధ్యాయులు నాగయ్య శివలీల జాఫర్ ప్రదీప్ హెడ్ కానిస్టేబుల్ బాలరాజు విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

**నందలూరు, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :**



టంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోని విద్యార్థులకు సాఫ్ట్వేర్ ఉద్యోగి వరప్రసాద్ పరీక్షా సామగ్రిని బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు పోటీ తత్వంతో, ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని కోరారు. పదో తరగతిలో మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు చాంద్ బాషా, ఉపాధ్యాయులు మస్తాన్ వలి, రజని, విద్యార్థులు పాల్గొన్నారు.

# తొట్టిగారిపల్లిలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

**బద్వేలు అర్బన్,ఫిబ్రవరి 25 , ప్రభాతవార్త**

బద్వేల్ మండలం తొట్టిగారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బందికి క్యాన్సర్ వ్యాధిపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి. రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్ కు చెందిన డాక్టర్ రమేష్ బాబు హాజరై క్యాన్సర్ లక్షణాలు, నిర్ధారణ, చికిత్స విధానాలపై సమగ్ర అవగాహన కల్పించారు. సమాజంలో క్యాన్సర్ వ్యాప్తి పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఆరోగ్య సిబ్బంది ప్రజలకు ముందస్తు గుర్తింపుపై చైతన్యం కల్పించాలని సూచించారు. మొదటి దశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే పూర్తి స్థాయిలో నయం చేయవచ్చని తెలిపారు. అలాగే ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా అర్హులైన వారికి ఉచిత వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించబడుతుందని, ప్రతి నెల మొదటి శనివారం బద్వేల్ పట్టణంలోని సంజీవిని ఆసుపత్రిలో డాక్టర్ రమేష్ అందుబాటులో ఉంటారని తెలిపారు. మహిళల్లో నోటి క్యాన్సర్, సర్వికల్ క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్; పురుషుల్లో



నోటి క్యాన్సర్, లంగ్ క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్, ప్యాంక్రియాస్ క్యాన్సర్ వంటి వ్యాధులపై స్క్రీనింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వినయ్ కుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రావతి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంగయ్య, హెల్త్ అసిస్టెంట్ జె. జనార్దన్ రావు, మెడికవర్ ఆసుపత్రి సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పన్నులు చెల్లించి
## పంచాయతీ అభివృద్ధికి సహకరించండి

**పీలేరు ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:**



నియోజకవర్గంలోని కలికిరి మండలం కలికిరి గ్రామ పరిధిలోని అన్ని పల్లెల్లో సకాలంలో ఇంటి పన్నులు చెల్లించాలని పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారి అశోక్ కుమార్ కోరారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు పంచాయతీలలో ఇప్పటికే లక్షల కొద్ది ఇంటి పన్నులు పెండింగ్ లో ఉన్నాయని వాటిని సకాలంలో చెల్లించి ప్రభుత్వానికి అధికారులకు తోడ్పాటు అందించాలని ఆయన కోరారు. అదే విధంగా గ్రామాలలో మరింత అభివృద్ధి జరగాలంటే ఇంటి పన్నులు చెల్లించాలని చెల్లించిన పన్నులతో గ్రామాలలో ఉన్న నీటి సమస్యను సిసి రోడ్లు పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు ఉపయోగిస్తామని ఆయన కోరారు. ముందు బకాయిలు చెల్లించకపోతే చట్టపరవంగా చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడ పోమని ఆయన హెచ్చరించారు.

## పశువుల సంతకు స్థలం కేటాయించాలి

**కలెక్టర్‌ను కోరిన మార్కెట్ యార్డ్ చైర్మన్ షఫీ నాయక్**



**లక్కిరెడ్డిపల్లి ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

మండలం కేంద్రం నందు కూరగాయల మార్కెట్ కోసం స్థలం కేటాయించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ షఫీ నాయక్ బుధవారం లక్కిరెడ్డిపల్లి లో కలెక్టర్ నిశాంత్ కుమార్ పర్యటనలో భాగంగా ఆయన కోరారు ఇక్కడ ప్రజలు పండించిన కూరగాయలను మార్కెట్ లేక ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారని వారి కోసం కూరగాయల మార్కెట్ మరియు పశువుల సంత లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని వారి కోసం ప్రభుత్వం స్థలాన్ని కేటాయించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌ని మార్కెట్ కమిటీ చైర్మన్ షఫీ నాయక్ కోరారు కలెక్టర్ నిశాంత్ కుమార్ స్పందిస్తూ తాసిల్దార్ క్రాంతి కుమార్‌కు కూరగాయల మార్కెట్ కోసం 50 సెంట్లు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని ఆదేశాలు జారీ చేశారు.

## పాఠశాలలే లక్ష్యంగా శక్తి దాడులు

**మదనపల్లిలో భారీగా కూల్ లిప్ స్వాధీనం**



**మదనపల్లె క్రైమ్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త.**

అన్నమయ్య జిల్లా ఎస్పీ దీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు మదనపల్లి పట్టణంలో విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. బుధవారం మదనపల్లి టౌన్ పరిధిలోని వివిధ పాఠశాలలు, కళాశాలల పరిసర ప్రాంతాల్లో ఉన్న దుకాణాలపై శక్తి టీం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. శక్తి టీం ఇన్చార్జ్, ఎస్ఐ గాయత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో విద్యాసంస్థల సమీపంలోని షాపుల్లో విక్రయిస్తున్న నిషేధిత పొగాకు ఉత్పత్తులను గుర్తించారు. ముఖ్యంగా యువతను, విద్యార్థులను బానిసలుగా చేస్తున్న కూల్ లిప్స్, ఇతర పొగాకు పదార్థాలను పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో పట్టుబడిన సామాగ్రిని తదుపరి చర్యల నిమిత్తం మదనపల్లి 1 టౌన్, 2 టౌన్ పోలీస్ స్టేషన్లకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గాయత్రీ మాట్లాడుతూ విద్యాసంస్థల సమీపంలో ఇటువంటి నిషేధిత పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటమన్నారు. ఈ కార్యక్రమాల్లో శక్తి టీం సభ్యులు బి. మునికుమార్‌నాయక్, మణికంఠ, వీణకుమారి పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ కళాశాలలో మెగా జాబ్ మేళా

**ప్రొద్దుటూరు ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

ప్రొద్దుటూరు మండల పరిధిలోని గౌతమి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 27 వ తేదీ శుక్రవారం స్వామి వివేకానంద ఇన్స్టిట్యూట్ మరియు యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం రామసుబ్బమ్మ తెలిపారు. ప్రధానంగా నిరుద్యోగ సమస్యకు పరిష్కారం దిశగా యువతి యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు మరియు ప్రముఖ కంపెనీలలో నేరుగా ఇంటర్వ్యూలు పొందే అవకాశాన్ని కల్పించేందుకే జాబ్ మేళా ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ప్రధానంగా ఈ జాబ్ మేళాలో ప్రముఖ ఎంఎన్సి ఐటీ కంపెనీలు క్యాప్ జెమినీ, వెల్స్ ఫార్గో, కాన్సెంట్రిక్స్, మరియు ఫార్మా కంపెనీలు డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్, భారత్ బయోటెక్, మరియు నాన్ ఐటీ కంపెనీలు కియా మోటార్స్, టాటా టెక్నాలజీస్, అలోరిక, ఎస్బిఐ యాక్సిస్ బ్యాంక్ వీటితోపాటు ఏడు ప్రముఖ కంపెనీల హెచ్ఆర్ లు పాల్గొని ఉద్యోగ ఎంపికలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కంపెనీలలో ఎంపికైన అభ్యర్థులకు మూడు నుండి ఐదు లక్షల వరకు వార్షిక ఆదాయం ఉంటుందని కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్ సురేంద్ర తెలిపారు 2021 సంవత్సరం నుండి 2025 సంవత్సరం వరకు డిగ్రీ అర్హత పొందిన ఇంజనీరింగ్ ఇంటర్ ఫార్మసీ విద్యార్థినీ విద్యార్థులు తమ బయోడేటా తో పాటు విద్యార్హత సర్టిఫికెట్ మరియు ఆధార్ ధ్రువపత్రాలతో హాజరు కావాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అనేకమంది యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ బాబమ్మ తెలిపారు. ఈ నెల 27 శుక్రవారం ఉదయం 9 గంటలకు జరిగే జాబ్ మేళాలో ప్రొద్దుటూరు మరియు పరిసర ప్రాంతాల అభ్యర్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల డైరెక్టర్లు నాగూరు రవీంద్రారెడ్డి కో డైరెక్టర్ శైలుష తెలిపారు.

## బాల్య వివాహాలపై అవగాహన సదస్సు

**పెండ్లిమర్రి, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**

పెండ్లిమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని శ్రీనివాసపురం అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని డిప్యూటీ హెచ్ఈవో శ్రీదేవి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం చిన్న వయసులోనే వివాహం చేసుకుంటే ఆరోగ్య సమస్యలు వస్తాయని సూచించారు. బాలిక శారీరకంగా, మానసికంగా అభివృద్ధి చెంది ఉండాలని లేకుంటే మాతృ, శిశు మరణాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. పిల్లల వివాహ విషయంలో తల్లిదండ్రుల వైఖరిలో మార్పు రావాలని బాల్య వివాహ చట్టం 2006 ప్రకారం బాలికకు 18 సంవత్సరాలు నిండిన తరువాత వివాహం చేయాలన్నారు. బాల్య వివాహం చట్టరీత్యా నేరమని ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతుంటే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, 100కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎల్లమ్మ, సీహెచ్ఓ అరుణ, ఏఎన్ఎం స్వరూప, అంగన్‌వాడీ టీచర్ స్వర్ణలత పాల్గొన్నారు.



## అద్వైత గురుకులం విద్యార్థుల సత్తా

**- రాష్ట్ర స్థాయి 1, 2, 3 ర్యాంకులతో ఘనవిజయం**



**గాలివీడు, ఫిబ్రవరి 25(ప్రభాతవార్త):**

అన్నమయ్య జిల్లా గాలివీడు మండలంలోని అద్వైత గురుకులం పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ (ఐఎన్‌టీఎస్‌ఓ) పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరిచి ఘనవిజయం సాధించారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఎం.కార్తీక్ (8వ తరగతి) రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించగా, ఎస్.లేఖ్యారెడ్డి(3వ తరగతి) రెండవ ర్యాంకు, కె.యామినీ (3వ తరగతి), ఎం.మోక్షిత్ (6వ తరగతి) మూడవ ర్యాంకులు సాధించారు. అదే విధంగా ఇద్దరు విద్యార్థులు నాల్గవ ర్యాంకు, ఐదుగురు విద్యార్థులు ఐదవ ర్యాంకు సాధించి విద్యాసంస్థకు గర్వకారణంగా నిలిచారు. వివిధ సబ్జెక్టుల్లో ప్రతిష్టాత్మక ర్యాంకులతో పాటు కన్సోలిడేషన్ సర్టిఫికెట్లు, మెరిట్ సర్టిఫికెట్లు కూడా విద్యార్థులు అందుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ డా.బి.ఇంద్రసేన మాట్లాడుతూ విద్యార్థుల నిరంతర సాధన, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల సహకారమే ఈ విజయానికి మూలకారణమని తెలిపారు. భవిష్యత్తులో జాతీయ స్థాయి పోటీల్లో కూడా తమ విద్యార్థులు మరింత మెరుగైన ఫలితాలు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విజయం పట్ల పాఠశాల డైరెక్టర్ రామకృష్ణ, ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్ హర్షం వ్యక్తం చేసి విజేత విద్యార్థులను అభినందించారు.

## పొర్లు దండాలతో వినూత్న నిరసనలు

**డిమాండ్లను పరిష్కరించాలంటూ నినాదాలు**



పొర్లుదండాలతో నిరసన తెలుపుతున్న దృశ్యం

**మదనపల్లె, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :**

సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం పొర్లు దండాలతో వినూత్న నిరసనలు తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రెండు రోజులుగా ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద రిలేనిరాహారదీక్షలు చేసినా ప్రభుత్వం స్పందించకపోవడంతో అంగన్‌వాడీవర్కర్లు, హెల్పర్లు, సిఐటియు ఆధ్వర్యంలో ఐసిడిఎస్ పీడి కార్యాలయం వద్ద పొర్లు దండాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి రాజేశ్వరీ, అధ్యక్షురాలు మదురవాణిలు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పదవీవిరణ పొందినవారికి రూ.10వేలు పెన్షన్ ఇవ్వాలని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గ్రాడ్యువేట్ మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అంగన్‌వాడీలకు వర్తింప చేయాలన్నారు. గతంలో తమ సమ్మెకు మద్దతు ఇచ్చిన ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు అధికారంలోకి వచ్చి రెండేళ్ళు అవుతున్నా ఇంతవరకు ఒక్క హామీకూడా నెరవేర్చలేదన్నారు. మా ఆవేదన గుర్తించి పరిష్కరించాలన్నారు. మార్చి 2న చలో విజయవాడ పేరిట మహాధర్నా నిర్వహిస్తామన్నారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి గంగాదేవి, సభ్యులు శ్యామల, విజయలక్ష్మి, భాగ్యమ్మలు పాల్గొన్నారు.

## లోక రక్షకీ గంగమ్మ తల్లీ నమోస్తుభ్యం

**పరికిదొన(చౌడేపల్లి), ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**



చింతపర్తి కుంటి గంగమ్మ

లోకాన్నంతటినీ రక్షించే తల్లీ చింతపర్తి కుంటి గంగమ్మా నమోస్తుభ్యమంటూ భక్తులు మొకరిల్లి నమస్కరించారు. మండలంలోని పంచాయతీ కేంద్రం పరికిదొనలో దాతలు చక్కల తాతయ్య, యల్లమ్మలచే నిర్మించిన చింతపర్తి కుంటి గంగమ్మ ఆలయంలో వార్షిక పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అగ్రహారం ఆనందాచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషాభిషేకం, అలంకరణగావించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు దాతలు పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## సాగునీరు పుష్కలంగా ఉంటే సస్యశ్యామలమే , టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్ రాజు

**రాజంపేట, ఫిబ్రవరి 25 ప్రభాతవా**

ప్రతి నీటి బొట్టు ఒడిసి పడితే సాగునీరు సమృద్ధిగా ఉంటుందని, అప్పుడు పంటలు సస్యశ్యామలమవుతాయని టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు అన్నారు. బుధవారం జగన్మోహన్రాజుమన్నూరు చెరువుకు గంగా హారతి ఇచ్చారు. అంతకుముందు గంగమ్మకు పూజలు నిర్వహించారు. సాగునీరు సద్వినియోగం చేసుకుంటే మన ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసుకోవచ్చని, ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీళ్లు పారించాలని చంద్రబాబు అనుకుంటే,జగన్ రెడ్డి మాత్రం రప్ప రప్ప అంటూ రక్తం పారించాలని చూస్తున్నారని చమర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ అధికారులు డి.ఈ జగదీష్, ఏఈ మధుసూదన్ రాజు,క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు,మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నే సుబ్బ నరసయ్య నాయుడు, మన్నూరు నీటి సంఘం అధ్యక్షులు రామచంద్రయ్య,మన్నూరు సొసైటీ చైర్మన్ ముళ్ళగూరి సుబ్రహ్మణ్యం నాయుడు,సొసైటీ డైరెక్టర్ బండారు రెడ్డి శేఖర్ గౌడ్,టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్,పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు అనసూయదేవి, మండల పార్టీ అధ్యక్షులు రవికుమార్ నాయుడు,తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొండూరు శరత్ కుమార్ రాజు,పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి ఎస్కే కరీమ్,హస్తివారిపల్లె రామ్మోహన్,జై కృష్ణంరాజు, రాజేష్,రామచందర్ రాజు, జగదీశ్వర్ రాజు,ఎల్ఐసి వెంకటరాజు,మాజీ అధ్యక్షులు సుబ్బరాజు నరసింహ రాజు తదితరులు పాల్గొన్నారు.



## శిక్షణ ఉపాధ్యాయులకి సన్మానం



**సంబేపల్లి ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని ఆ వృత్తిని ఎంచుకొని ఉపాధ్యాయ శిక్షణ పొందడం గొప్ప విశేషమని ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య పేర్కొన్నారు. బుధవారం సంబేపల్లిలోని మోడల్ ప్రైమరీ పాఠశాల నందు 25 రోజులుగా శిక్షణ పొందిన ఉపాధ్యాయనీలను సన్మానించారు. ఉపాధ్యాయ వృత్తిలో భాగంగా తమ పాఠశాలకు 25 రోజులుశిక్షణ కొరకు వచ్చిన విద్యార్థులకు చీరలు పసుపు కుంకుమతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ 25 రోజులపాటు మా పాఠశాలలో క్రమశిక్షణతో పిల్లలకు విద్యను నేర్పారన్నారు. అందులో భాగంగానే వారికి చిరు సత్కారం అందుచేయడం జరిగింది అన్నారు. తల్లి,తండ్రి తర్వాత గురువుదే స్థానమని అటువంటి గురువు స్థానాన్ని ఎంచుకొని శిక్షణ పొందడం గర్వించదగ్గ విషయమన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారిని దీవించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయమ్మ, రెడ్డన్న, రెడ్డయ్యరాజు, నాగేశ్వర్ నాయక్,ఎమ్మార్సీ సిబ్బంది సిబ్బంది పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారమే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

**పీలేరు ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:**

ఆటో డ్రైవర్ల సమస్యలకు పరిష్కారం చూపిస్తూ బిస్మిల్లా ఆటో యూనియన్ సంఘాన్ని బలోపేతం చేస్తూ ముందుకు తీసుకుపోవాలని నూతనంగా ఆటో యూనియన్‌లో ఎన్నికైన వారికి కృతజ్ఞతలు తెలిపిన బిస్మిల్లా ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బోదేషా వలి తెలిపారు. పీలేరు పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలోఆటో డ్రైవర్ల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలుగుదేశం పార్టీ పీలేరు మండల అధ్యక్షులు వారణాసి శ్రీకాంత్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు ఎన్ అమర్నాథరెడ్డి, పీలేరు మార్కెట్ యార్డ్ చైర్మన్ పురం రామమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు విధిగా ప్రయాణికులకు సురక్షితమైన రవాణా సౌకర్యం కల్పించి సమాజంలో బాధ్యతాయుతంగా నిజాయితీగా నడుచుకోవాలని వారు సూచించారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ లైసెన్స్ తో పాటు యూనిఫామ్ తో కలిగి ఉండాలని కోరారు. ఆటో డ్రైవర్ల ను దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం సంవత్సరానికి 15000 వేల రూపాయలు చొప్పున డ్రైవర్లకు ఆర్థికంగా అందించి ఆదుకుంటుందని తెలిపారు. నూతనంగా ఎన్నికైన సంఘం సభ్యులకు నియామక పత్రాలు అందించి 150 మంది యూనిఫామ్ లు పంపిణీ చేశారు. బిస్మిల్లా ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుదులు పురం రామమూర్తి. ఉపాధ్యక్షులుగా సురేష్ బాబు సలీం నూతనంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి జిల్లా సెక్రటరీ శ్రీనివాసులు, పీలేరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గోల కిషోర్ నాయుడు, మూడే రమణ నాయక్ శ్రీనివాసులు రాజా ఖాదర్బాషా మహబూబ్ బాషా వెంకటరమణ వేణుగోపాల్ కుమార్ శీను తదితరులు పాల్గొన్నారు.

## రైతు ఉత్పత్తిదారుల మస్తా
## బలోపేతానికి మెరుగైన నైపుణ్యం

**బి. కొత్తకోట ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :**

రాష్ట్రంలోని రైతు ఉత్పత్తిదారుల సంస్థలు మెరుగైన నైపుణ్యాలతో అభివృద్ధి వైపు నడవాలని సెర్ప్ అదనపు డైరెక్టర్ మహిత సూచించారు. బుధవారం బి కొత్తకోట మండలం హార్సిలీ హిల్స్‌లో వి ఎస్ ఆర్ విండ్ వేవ్ రిసార్ట్ లో రాష్ట్ర స్థాయి రైతు ఉత్పత్తిదారుల సంస్థలు అభివృద్ధిపై సర్ప్ సిబ్బందికి మూడు రోజుల శిక్షణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని మహిత లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా రైతుల అభివృద్ధి కొరకు చేపడుతున్న అనేక కార్యక్రమాలు విజయవంతం కావాలంటే రైతులు అందరూ సంఘటితమై తమ సంస్థలను తామే నడుపుకునే స్థాయికి ఎదగాలని ప్రోత్సహించారు. డి ఆర్ డి ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం నాగేశ్వరావు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి రైతు ఉత్పత్తిదారుల శిక్షణా తరగతులు ఇక్కడ జరగడం హర్షనీయమని ఇక్కడ ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాలలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని క్షేత్రస్థాయిలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ సభ్యులకు అవగాహన కల్పించి ఎఫ్ పి ఓ లను బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. డిజిటల్ గ్రీన్ ప్రతినిధి సురేందర్ శిక్షణా కార్యక్రమం రైతుల యొక్క అవసరాలను ఏ విధంగా గుర్తించాలి అందుకు అనుగుణంగా వ్యాపార ప్రణాళికలు ఏ విధంగా రూపొందించుకోవాలి దాని అమలు చేసే విధానం మరియు వివిధ వ్యాపార నమూనాల గురించి చర్చించి మన అవసరాలకు తగినట్లుగా ఏ విధంగా ప్రణాళిక రూపొందించుకోవాలో అనే అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాన్ని సెర్ప్ డిజిటల్ గ్రీన్ మరియు వాసన్ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాసులు, సెర్ప్ ఏడి లైవ్ స్టాక్ కులశేఖర్, రాష్ట్రంలోని అన్ని జిల్లాల (జీవనోపాదుల)డీపీఎంలు, ఏపీఎంలు, పాల్గొన్నారు.





## స్పెషల్ పార్టీలతో కొనసాగుతున్న దాడులు



**కడప క్రైం, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**

గంజాయి, అసాంఘిక కార్యకలాపాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం సేవించే వారిపై కఠిన చర్యలకు పోలీసు అధికారులు స్పెషల్ పార్టీ సిబ్బంది ద్వారా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ మరియు డ్రోన్ కెమెరాల ద్వారా సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో కడప తాలూకా సీఐ టి.రెడ్డప్ప ఆధ్వర్యంలో కడప నగరం తాలూకా పీఎస్ పరిధిలో గంజాయి సేవనం, బహిరంగ మద్యపానం, అసాంఘిక కార్యకలాపాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో కడప సబ్ డివిజన్ స్పెషల్ పార్టీ సిబ్బంది దాడులు నిర్వహించారు. అత్యాధునిక డ్రోన్ కెమెరాల సాయంతో జల్లెడ పడుతున్నారు. బుధవారం అనుమానాస్పదంగా సంచరించే వారిపై నిఘా ఉంచడంతో పాటు గంజాయిని సేవించే వారిని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిని గుర్తించేందుకు విస్తృత చర్యలు చేపట్టారు. నగరంలోని తారకరామానగర్, రవీంద్రనగర్, బాలాజీనగర్, కాగితాలపెంట, సత్తార్ కాలనీ, శ్రీహరి డిగ్రీ కాలేజీ, హోమియోపతి కాలేజీ, ఏఎస్ఆర్ నగర్, బుగ్గవంక రైల్వే వంతెన, పాత బస్టాండ్, తదితర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచడం ద్వారా అనుమానితులను గుర్తించే చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో నిరంతరం కడప నగరంలోని అనుమానిత ప్రాంతాలను పోలీసు శాఖ ఆధ్వర్యంలో జల్లెడ పట్టడం జరుగుతుందని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు.

## హోమంలో పాల్గొన్న మఠాధిపతుల దంపతులు



**బ్రహ్మంగారిమఠం ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి దేవస్థానంకు నూతన మఠాధిపతులుగా శ్రీశ్రీశ్రీ వీరధర్మజ వేంకటాద్రి స్వాములవారు నియమితులైన సందర్భముగా ఈ నెల 24 వ తేదీ నుండి నేటి వరకు జరుగు మఠాధిపతుల పట్టాభిషేకం మహోత్సవాలలో బాగంగా నూతన మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీరధర్మజ వేంకటాద్రి స్వాములవారు వారి ధర్మపత్ని ఉమాదేవి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు దేవస్థాన వేద పండితులు ద్వారా మేల తాళాలతో భక్తుల మధ్య అంగరంగ వైభవంగా జరిగాయి. మఠాధిపతిని జిల్లా పరిషత్ చైర్మన్ ముత్యాల రామ గోవింద రెడ్డి, మాజీ డిసిసి చైర్మన్ తిరుపాల్ రెడ్డి కలిశారు.

## నూతన రథ పూజా కార్యక్రమాలు

**బద్వేలు, ఫిబ్రవరి25, ప్రభాతవార్త**



బద్వేలు మండలంలోని లక్ష్మీపాలెం గ్రామంలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో నూతన రథ పూజా కార్యక్రమాలు గురువారం అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. దాతల సహకారంతో సుమారు రూ.1.20 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ నూతన రథాన్ని వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు అంకితం చేశారు. వార్షిక బ్రహ్మోత్సవాల ప్రారంభాన్ని పురస్కరించుకుని నూతన రథానికి ప్రాణ ప్రతిష్ట హోమాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మైసూరు కు చెందిన ధనుర్దాస రామానుజ జీయర్ స్వామి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరగగా, ప్రధాన అర్చకులు మొగదలై భరద్వాజ్ స్వామి బృందం వేద మంత్రోచ్చారణల మధ్య పూజలు నిర్వహించారు. రాత్రి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా అంకురార్పణ కార్యక్రమం ఘనంగా జరుగుతుందని ఆలయ చైర్మన్ సత్య సంజీవ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శ్రీవారి ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది.

## ఉపాధి హామీ పనులపై సమీక్ష



**దువ్వూరు, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**

స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సభా భవన్ లో బుధవారం ఉపాధి హామీ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సుబ్బారెడ్డి మాట్లాడుతూ మార్చి లోగా పూర్తి చేయవలసిన పనులను గుర్తించి వాటిని పూర్తి చేయాలన్నారు. ఏప్రిల్ నుండి కొత్త ఆర్థిక సంవత్సరం వస్తున్నందున ఉపాధి హామీ పథకంలో మార్పులు వస్తున్నాయని అందువల్ల పాత పనులను పూర్తి చేయడమా లేక తొలగించడమో చేయాలన్నారు. అలాగే త్వరలో ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ సభ జరుగుతుందని అందుకు రికార్డులన్నీ సక్రమంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం మండలంలో మంజూరైన వివిధ రకాల పనులను గురించి సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రమణారెడ్డి, ఏపీఓ లక్ష్మీనారాయణ, ఈసీ ఇందిరా ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## చేపల చెరువుల ద్వారా ఆదాయం

**సదుం ఫిబ్రవరి 25 ప్రభాత వార్త**

మండల పరిధిలోని చెరుకువారిపల్లె బూరగ మంద గ్రామ పంచాయతీల్లో బుధవారం అధికారులు చేపల చెరువుల వేలం నిర్వహించారు. ఇందులో భాగంగా చెరుకువారిపల్లె అయ్యవారి చెరువును రూ 43100 కు ఉమామహేశ్వరావు అనే వ్యక్తి, అయ్యవారి ఒడ్డు చెరువును జే మధుసూదన్ రెడ్డి అనే వ్యక్తి 40 వేలకు దిగువ చెరువును అల్లా బక్షు అనే వ్యక్తి 15500 కు వేలం ద్వారా పొందారు. మొత్తం చెరుకువారిపల్లె పంచాయతీకి 98600 ఆదాయం వచ్చింది. అదేవిధంగా బూరగమంద పెద్ద చెరువుకు 30000, చిన్నమ్మ చెరువుకు 11000 చొప్పున పంచాయతీకి 41 వేలు ఆదాయం సమకూరింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాధా రాణి, డిప్యూటీ ఎంపీడీవో నాగరాజు, పంచాయతీ డెవలప్మెంట్ అధికారులు విజయభాస్కర్, శశిధర్ జీవన్, సర్పంచ్ ఐశ్వర్య, తదితరులు పాల్గొన్నారు.

